కొనలేం.. కట్టలేం..!

- పెరిగిన ధరలతో నిర్మాణ రంగం కుదేలు
- సిమెంట్, ఇనుము, ఇటుక రేట్లు పైపైకి
- నెరవేరని మధ్యతరగతి వర్గాల సొంతింటి కల





కరకగూడెంలో నిర్మాణ పనులు నిలిచిపోయిన ఇళ్లు

కరకగూడెం: సొంతిల్లు కలిగి ఉండాలనేది ప్రతీ ఒక్కరి కల. కానీ ఒక్కసారిగా పెరిగిన సామగ్రి ధరలతో నిర్మాణ రంగం అతలాకుతలమవుతోంది. ప్రస్తుత రోజుల్లో భవన నిర్మాణమంటే సామాన్యుడే కాదు.. బిల్డర్లూ భయపడే పరిస్థితి తలెత్తింది. ఇనుము, సిమెంట్, ఇసుక, కంకర ఇలా అన్ని నిర్మాణ వస్తువుల ధరలు రోజురోజుకూ ఎగబాకుతున్నాయి. తొలుత కొంత అంచనా వ్యయంతో నిర్మాణాలు ప్రారంభిస్తే పెరిగిన ధరలతో అంచనా వ్యయం తప్పి భారీగా ఖర్చులు పెరుగుతున్నాయి. దీంతో సొంతంగా ఇల్లు కట్టుకోవాలనే సాహసం చాలా మంది చేయలేకపోతున్నారు. నిర్మాణం మొదలు పెట్టి ముందుకెళ్లే సామర్థ్యం లేక మధ్యలో వదిలేస్తున్న వారు మండలంలో చాలా మంది ఉన్నారు. అప్పోసొప్పో చేసి పూర్తి చేద్దామనుకున్నా మోయలేని ఆర్థిక భారంతో పలువురు చితికిపోతున్నారు. అంతేకాకుండ పట్టణాల్లో బిల్డర్ల పరిస్థితి కూడా ఇలానే ఉంది. ఎలాగోలా.. చేతిలో ఉన్నవి పూర్తి చేసి ఇప్పట్లో కొత్తగా నిర్మాణాల వైపు వెళ్లొద్దనుకునే వారూ ఉన్నారు. ఈ పరిస్థితులు నిర్మాణ రంగాన్ని మరింత జటిలంగా మార్చాయి.

ధరలు ఇలా..

భవన నిర్మాణాలకు వేసవినే మంచి సీజన్‌గా భావించి ఇబ్బడిముబ్బడిగా నిర్మాణాలు చేపట్టే తరుణమిదే. అయినా నిర్మాణాలకు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఇనుము ధర ఇప్పుడు భారీగా పెరిగింది. సిమెంట్ ఒక కట్టా 350 నుంచి 380 వరకు ఉంది. ఎర్ర ఇటుక రూ.7 ఉండడంతో పలువురు పెద్ద బ్రిక్స్‌ను రూ.17 కు కొనుగోలు చేస్తున్నారు. ఇసుక కూడా 1 ట్రాక్టర్ 1000 నుంచి 1500 పలుకుతుంది. వీటికి తోడు కంకర, సెంట్రింగ్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, కార్పెంటర్స్, టైల్స్, ఫాల్ సీలింగ్, పెయింటింగ్, కబోర్డ్స్, రేకులు కిటికీలు, గుమ్మాల తదితర ధరలు విపరీతంగా పెరగడంతో పలువురు ఆందోళన చెందుతున్నారు. కాగా, పలు చోట్ల స్లాబ్ వేయడానికి భారీగా ఖర్చు అవుతుండడంతో పలువురు గ్రీన్ పరదాలు కట్టుకొని, రేకులు, తాటాకులు వేసుకొని జీవనం సాగిస్తున్నారు.

ఆకాశాన్నంటిన మేస్త్రీలు, కార్పెంటర్ల ఖర్చులు!

ఇంటి నిర్మాణం సాఫీగా సాగాలంటే మేస్త్రీల పాత్ర ఎంతో కీలకం. ముగ్గు పోసినప్పటి నుంయి ఇళ్లు పూర్తయ్యేవరకు వీరు లేనిదే పని జరగదు. అయితే వీరికి చెల్లించే కూలి అమాంతం పెరిగింది. ఒక రోజుకు మేస్త్రి పనిని బట్టి రూ.1000 నుంచి 1200, హమాలి 500 నుంచి 600 తీసుకుంటున్నారు. అయినప్పటికీ కొందరు పని ఒప్పుకుని ప్రారంభించి మధ్యలోనే వదిలేస్తున్నారు. మరలా ఇంకో పనిని మొదలపెడుతూ తీవ్ర ఇబ్బదులకు గురి చేస్తున్నారు. అక్కడ కూడా పూర్తి స్థాయిలో పని చేయక పోగా మరికొంత మంది ఊరినుంచి అడ్రస్ లేకుండా పారిపోయిన సందర్భాలు అనేకం. కార్పెంటర్లు కూడా ఒప్పుకున్న కిటికీలు, గుమ్మాలు, దర్వాజాలు సకాలంలో ఇంటి యజమానులకు ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. వారిని ఇంటి చుట్టూ పదే పదే తిప్పించుకుంటున్నారు. క్రను బట్టి వస్తువులకు భారీగా ధరను చెప్పుతున్నారు. వారితో ఇంటి యజమానులకు గొడవలు అయినా సంఘటనలు కూడా ఉన్నాయి.

ప్రభుత్వం సాకరమందించేనా..?

గత ప్రభుత్వం మండలంలోని భట్టుపల్లి గ్రామంలో నిరుపేదకు డబుల్ బెడ్రూంలు కేటాయించింది. నూతనంగా కొలువు దీరిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నీరు పేదలకు ఇళ్ల నిర్మించుకోవడం కోసం అభయహస్తం దరఖాస్తులు స్వీకరించింది. అర్హులైన పేదలకు ఇంటి నిర్మాణకి ఆర్థిక సాయం చేస్తే ఎంతో మేలు జరిగే అవకాశం ఉంది.

ప్రభుత్వం ఆదుకోవాలి



రెక్కల కష్టంపై బతికే మేము సొంతగూడు కోసం ఎన్నో కష్టాలు పడుతున్నాం. తక్కువలో పూర్తవుతుందని ఇల్లు మొదలు పెట్టాం. ప్రస్తుతం పునాది లెవల్ లోనే ఉంది. ధరలు విపరీతంగా పెరగడంతో నిర్మాణం ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం స్పందించి పేదల ఇంటి నిర్మాణానికి ఆదుకోవాలి.

– షేక్ యాకుబ్ పాషా, కరకగూడెం

కలగానే సొంత ఇల్లు..



ప్రస్తుత రోజుల్లో రేట్లు విపరీతంగా పెరగడంతో పేదలకు కలగానే స్వంతింటి కల మిగిలేటట్లు ఉంది. నిర్మాణ రంగానికి అవసరమైన సామగ్రి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రెండేళ్లలో పోలిస్తే అన్నింటి ధరలు రెట్టింపు అయ్యాయి. తద్వారా మేము ఇంటి నిర్మాణ పనులు వాయిదా వేసుకుంటున్నాం.

– అనుముల సమ్మక్క, అనంతారం

మేస్త్రీలు రేట్లు పెంచారు..



నేను ఇల్లు కడుదామని నిర్ణయించుకుని స్థానికంగా ఉన్న మేస్త్రీని పిలిపించా. ప్రతీ దానికి రేట్లు పెరిగాయని మేము కూడా రేట్లు పెంచుతున్నామని రోజుకు రూ.1000 ఇవ్వాలని కోరాడు. నేను ససేమీరా అనడంతో ప్రస్తుతం ఇంకా నిర్మాణం చేపట్టలేదు. అధికారులు ధరలను నియంత్రించాలి.

– పఠాన్ మహిబూబ్ ఖాన్, పద్మాపురం

బీజేపీకి ఎవరితోనూ పొత్తుండదు..

- భద్రాచలం రామాలయాన్ని సర్క్యూట్‌గా చేస్తాం..
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



మణుగూరుటౌన్: సంకల్ప సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

మణుగూరుటౌన్: రానున్న లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తులు పెట్టుకునే యోచనలో లేదని కామారెడ్డి ఎమ్మెల్యే, బీజేపీ శాసన సభ పక్ష ఉపనేత కాటిరెడ్డి వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం భద్రాచలం రామాలయాన్ని అయోధ్య రామాలయ తరహాలో సర్క్యూట్‌గా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్ప యాత్ర సాయంత్రం మణుగూరుకు చేరగా అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమం కాంక్షించే పార్టీ ఒక్క బీజేపీ మాత్రమేనని, ఇచ్చిన మాట ప్రకారం అయోధ్య, ముద్రలోన్లు, మరుగుదొడ్లు, 370 ఆర్టికల్ తీసివేత, వడ్డీ లేని రుణాలు, చిరు వ్యాపారులకు లోన్లు, రేషన్ బియ్యం పంపిణీ, క్రీడా ప్రాంగణాలు వంటి పనులకు నిధులు ఇచ్చి అభివృద్ధి చూపించిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనన్నారు. తెలంగాణలో రాష్ట్రంలో 17కు 17 ఎంపీ సీట్లు గెలుస్తామని, మహబూబాబాద్ సీటు తమదేనని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పి అందరి నుంచి అప్లికేషన్లు తీసుకున్న కాంగ్రెస్ పార్టీ.. వెరిఫికేషన్ చేయడం మరిచిందని విమర్శించారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ హయాంలో లక్షా 60 వేల కోట్ల అవినీతి జరిగిందని, 7 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రస్తుతం దానిపై చర్యలు తీసుకున్నది లేదన్నారు. ఉద్యోగులకు ఒకటో తారీఖు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మహబూబాద్ పార్లమెంట్ కన్వీనర్ ఐకార్ మెంబర్ ముస్కు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంపన సీతారామరాజు, దేవేంద్ర వర ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి పాముల ఐలయ్య, నియోజకవర్గ కన్వీనర్ పున్నం భిక్షపతి, గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఈసాల వెంకటేశ్వర్లు, నియోజకవర్గ నాయకులు పొడియం బాలరాజు, జిల్లా కార్యదర్శి ముత్యాల వెంకటేశ్వరరావు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చిర్రా సరస్వతి, పట్టణ అధ్యక్షుడు లింగంపల్లి రమేశ్, మండల అధ్యక్షుడు కుంజా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కట్టా భిక్షపతి, కరకగూడెం మండల అధ్యక్షుడు గంగనపల్లి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

గ్రంథాలయ నిర్మాణానికి కృషి చేద్దాం



పంచాయతీ కార్యాలయంలో సమావేశమైన అఖిలపక్ష పార్టీల నాయకులు

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలో గ్రంథాలయ భవన నిర్మాణం కోసం ఐక్యంగా కృషి చేద్దామని అఖిలపక్ష నాయకులు నిర్ణయించారు. గ్రంథాలయ భవననిర్మాణ సన్నాహక కమిటీ రెండో విడత సమావేశం పంచాయతీ కార్యాలయంలో ఆదివారం జరిగింది. చండ్రుగొండలో గ్రంథాలయానికి భవననిర్మాణంతో పాటు మహిళల కోసం మూత్రశాలల నిర్మాణానికి తీర్మానం చేశారు. మూత్రశాలలు లేక మహిళలు పడుతున్న ఇబ్బందులపై చర్చించారు. సమస్యలను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దృష్టికి తీసుకెళ్లేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ దార వెంకటేశ్వరరావు, సారేపల్లి శేఖర్, వారాధి సత్యనారాయణ, రాయి రాజా, సూరా వెంకటేశ్వర్లు, వరికూటి వెంకట్రావ్, యండి.ఖాజాహుసేన్, సీహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంపై తనిఖీలు నిర్వహించాలి

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీలో గత ప్రభుత్వం 2022–23 ఆర్థిక సంవత్సరంలో నిర్మించిన సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు నాసిరకంగా ఉన్నాయని, క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్ అధికారులు వీటిని తనిఖీలు చేయాలని అఖిలపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. గ్రామంలో ఆదివారం జరిగిన సమావేశంలో అఖిల పక్ష నాయకులు మాట్లాడారు. గ్రామంలో సీసీరోడ్లు, గ్రావెల్ రోడ్ల విషయంలో నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ పోయకుండా అదే రోడ్లపై సీసీ రోడ్లు నిర్మించారన్నారు. అధికారులు తనిఖీలు నిర్వహించి నివేదిక ఆధారంగానే బిల్లులు మంజూరు చేయాలని, అప్పటి వరకు బిల్లులు పెండింగ్‌లో ఉంచాలని నాయకులు డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంపీటీసీ బేతం రామకృష్ణ, మాజీ సర్పంచ్ స్వర్గం బాలనర్సయ్య, సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీల నాయకులు దండి రాములు, కమటం సురేష్, దంతాల జగదీష్, తూము పెద వీరరాఘవులు, రాగం మల్లయ్య, సంపత్, దేవరపు శ్రీనివాస్, సురకంటి వెంకటరమణ, మానాది వెంకన్న, సైదులు, నారాయణ, దేపంగి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మతల్లి కల్యాణోత్సవం

బూర్గంపాడు: మండల పరిధిలోని మణుగూరు క్రాస్‌రోడ్‌లోని తిరుపతమ్మ తల్లి ఆలయంలో శనివారం రాత్రి గోపయ్య సమేత తిరుపతమ్మ తల్లి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ కల్యాణోత్సవంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ అమ్మవారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారి కల్యాణోత్సవాన్ని భక్తులు పెద్దసంఖ్యలో వీక్షించారు. అమ్మవారి కల్యాణోత్సవంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



అమ్మవారి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

ఎమ్మెల్యే దంపతులకు సత్కారం



ములకలపల్లి: ఎమ్మెల్యే దంపతులను సత్కరిస్తున్న పీడీ, పీఈటీలు

ములకలపల్లి: వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దంపతులను ఘనంగా సత్కరించారు. మండలపరిధిలోని కమలాపురం ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీఈటీలు, పీడీలు దుశ్శాలువ, పూలమాలతో ఆత్మీయంగా సన్మానించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. పూర్వాశ్రమంలో పీఈటీగా పనిచేసిన జారే ఆదినారాయణ ఎమ్మెల్యేగా విజయం సాధించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నతస్థానాలు సాధించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ సర్పంచ్ కారం సుధీర్, బాల అప్పారావు, పిడియాల బుజ్జి, సురభి రాజేశ్, కటికనేని ఆదిత్య, గిరి, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శుభ కార్యాలకు హాజరు

అశ్వారావుపేటరూరల్: పలు గ్రామాల్లో ఆదివారం జరిగిన శుభ కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యేతోపాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు హాజరైయ్యారు. మండలంలోని రామన్నగూడెం గ్రామంలో మాజీ సర్పంచ్ నారం రాజశేఖర్ బంధువుల ఇంట్లో జరిగిన ఓ శుభ కార్యక్రమానికి అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ విప్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, స్థానిక మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు వేర్వేరుగా హాజరై చిన్నారిను ఆశీర్వాదించారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే మండలంలోని అనంతారం, గుమ్మడవల్లి, ఆసుపాక గ్రామాల్లో జరిగిన పలు శుభ కార్యక్రమాలకు హాజరైయ్యారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు హాజరైయ్యారు.

పరామర్శ..

దమ్మపేట: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పరామర్శించారు. మండలంలోని లింగాలపల్లి గ్రామానికి చెందిన కొర్సా లక్ష్మణరావు అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం లింగాలపల్లిలో అతడిని పరామర్శించి, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు

చర్ల: మండలంలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రమైన చర్లలో ఆదివారం జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా, దంతెవాడ జిల్లాల్లోని అటవీ ప్రాంత గ్రామాలతో పాటు చర్ల మండలంలోని అటవీ ప్రాంతాలకు చెందిన ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. ఈ క్రమంలో ఆదివాసీల మాటున మావోయిస్టులు, సానుభూతిపరులు, మిలీషియా సభ్యులు, కొరియర్లు, మిలిటెంట్లు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు పెద్ద ఎత్తున తనిఖీలను చేపట్టారు. చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన ఉంజుపల్లి రోడ్, తాలిపేరు ప్రాజెక్ట్ రోడ్, కుర్నపల్లి రోడ్, పులిగుండాల రోడ్‌లలో మోహరించిన పోలీసు బలగాలు వచ్చి పోయే వారిని నిశితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంలో పలువురు ఆదివాసీలను అనుమానితులుగా భావిస్తూ అదుపులోకి తీసుకోగా విచారించి నిర్ధారించుకున్న తరువాత వారిని విడిచిపెట్టారు. సీఐ ఏ.రాజువర్మ నేతృత్వంలో ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డి తనిఖీలను నిర్వహించగా సివిల్, స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామచంద్ర స్వామి ఆలయానికి గ్రామానికి చెందిన గారపాటి మోహన్‌రావు జ్ఞాపకార్థం ఆయన భార్య గారపాటి శారదమ్మ, కుమారుడు గారపాటి నరేందర్‌లు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళంగా అందజేశారు. శారదమ్మ కుటుంబానికి ఆలయ కమిటీ వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

యాత్రను జయప్రదం చేయండి

అశ్వారావుపేటరూరల్: బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం దమ్మపేట మండలం నెమలిపేట గ్రామంలో జరిగే విజయ సంకల్ప యాత్ర సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ అశ్వారావుపేట మండల అధ్యక్షుడు బండారు చంద్రశేఖర్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ యాత్రకు బీజేపీ రాష్ట్ర నేతలు హాజరు అవుతారని, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు.

ఆరోగ్య సంరక్షణకు చేయూత

బూర్గంపాడు: ప్రజల సమగ్ర ఆరోగ సంరక్షణకు ఆస్టర్ హెల్త్‌కేర్ యూనిట్‌తో కలసి రోటరీ క్లబ్‌లు చేయూతనందిస్తున్నాయని రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు. బూర్గంపాడు మండలంలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో రోటరీ, ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమగ్ర ఆరోగ్య సంరక్షణ కార్యక్రమ సన్నాహక ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలోని 8 వేల మంది జనాభా ఆరోగ్య స్థితిగతులపై ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తామన్నారు.

ఆ నివేదికల ఆధారంగా నెలవారీ వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరి హెల్త్ రిపోర్ట్‌లను విశ్లేషించి ప్రత్యేక హెల్త్‌క్యాంపులు నిర్వహిస్తామన్నారు. భవిష్యత్ ఆరోగ్య సంరక్షణ కోసం ప్రజలకు అవగాహన కల్పించేందుకు వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. సమగ్ర ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాల్లో అన్నిరకాల రోగాలకు వైద్యసేవలను అందించేందుకు వైద్య పరీక్షలు, స్కానింగ్‌లు, స్క్రీనింగ్‌లు చేయిస్తామన్నారు. ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్‌ను రూపొందించి అందుకు అనుగుణంగా వైద్యసేవలను కొనసాగిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఆస్టర్ గ్రూప్ హాస్పటల్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ దేవానంద్, వైద్యుల బృందం పాల్గొన్నారు.



నాగినేనిప్రోలులో మాట్లాడుతున్న బూసిరెడ్డి శంకర్‌రెడ్డి

ఏజెన్సీ దరిచేరని బస్సులు

- ఆర్టీసీ సర్వీసుల లేమితో ఆటోలే దిక్కు
- మహిళలు, విద్యార్థులకు తప్పని తిప్పలు
- మహాలక్ష్మి పథకానికి నోచుకోని వైనం




చర్లలో ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న మహిళలు

చర్లరూరల్: తెలంగాణా ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మహిళలకు ఊరటనిచ్చింది. కాని ఈ ఆనందానికి ఏజెన్సీ ప్రాంత మహిళలు దూరమౌతున్నారు. ఆయా ప్రాంతాల్లో ఆర్టీసీ సర్వీసులు లేకపోవడమే ఇందుకు కారణం.

చర్ల మండలంలోని వివిధ గ్రామాల్లో ఉండే మహిళలు భద్రాచలంతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. వ్యక్తగత పనుల నుంచి ఇతర ప్రయాణాల వరకు రాకపోకలు సాగిస్తూనే ఉంటారు. ముఖ్యంగా పట్టణాలల్లో నివసించే మహిళలు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థినిలు రోజూ పట్టణానికి వెళ్లి వస్తుంటారు. ఈ ప్రయాణాలు చేసేవారంతా మొదట మండల కేంద్రం చర్లకు చేరుకుంటారు. అక్కడి నుంచి భద్రాచలం వెళ్తుంటారు. అయితే చర్ల వరకు వెళ్లడానికి వీరికి ఆటోలే దిక్కు. ఆర్టీసీ బస్సు సర్వీసులు లేవు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఏజెన్సీలో నివసించే మహిళలకు ఉపయోగకరంగా ఉండేలా ప్రభుత్వం చొరవ చూపాలని గ్రామాల్లో నివసించే మహిళలు కోరుతున్నారు.


బస్సు సౌకర్యం కల్పించాలి



ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఏజెన్సీ గ్రామాల్లో నివసించే మాలాంటి మహిళలకు ఎటువంటి ప్రయోజనం లేదు. చర్ల మండల కేంద్రానికి వెళ్లాలంటే ఆటోలపైనే వెళ్లాలి. చర్లకు వెళ్లి రావడానికే వంద రూపాలకు పైగా రవాణా చార్జీలే అవుతున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి పెదమిడిసిలేరు గ్రామానికి బస్సుసౌకర్యం కల్పించాలి.

– గొంది స్వరూప, పెదమిడిసిలేరు

మాకూ ఉపయోగపడాలి..



ఉచిత ఆర్టీసీ ప్రమాణం పట్టణాలలో నివసించేవారికే కాకుండా మారుమూల ఏజెన్సీ గ్రామాల్లో నివసించే మాలాంటి మహిళలకూ ఉపయోగపడేలా ప్రభుత్వం ఆలోచన చేయాలి. మా పెదమిడిసిలేరు గ్రామానికి కనీసం ఉదయం,సాయంత్రం వేళల్లోనైనా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలి. చుట్టు పక్కల అనేక గ్రామాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది.

– బెండబోయిన ధనలక్ష్మి, పెదమిడిసిలేరు

మహిళలందరికీ వర్తింపజేయాలి



ఆర్టీసీలో ఉచిత ప్రయాణం మహిళలందరికీ వర్తించేలా ఉండాలి. మేము బస్సులో ప్రయాణం చేయాలంటే కలివేరు గ్రామంవద్ద బస్సు ఎక్కాల్సి ఉంటుంది. అక్కడి వరకు మాకు ఆటోలే దిక్కు. ఒక్కోసారి ఆటో సౌకర్యం లేక నడిచి మా గ్రామాలకు చేరుకోవాల్సిన పరిస్థితి. చదువుకునే మా పిల్లలకు పరిస్థితీ అదే. దయచేసి మా గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి.

– పసల నాగమణి, నాయకుల కొత్తూరు

క్లుప్తంగా

28 నుంచి జాతర

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామ శివారులో కొలువైన కట్టమైసమ్మ తల్లి ఆలయం వద్ద ఈ నెల 28వ తేదీ నుంచి జాతర ఉత్సవాలు జరగనున్నాయి. అమ్మ వారి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఉత్సవాలను మార్చి 3వ తేదీ వరకు నిర్వహిస్తారు. జాతర ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే ప్రారంభించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ జాతరకు అశ్వారావుపేట, దమ్మపేట మండలాలతోపాటు పొరుగున ఉన్న ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు, కుక్కునూరు, జీలుగుమిల్లి మండలాల నుంచి భక్తులు పెద్ద స్థాయిలో తరలి వస్తారు.

ఏపీ ఎమ్మెల్యేను కలిసిన లిటిల్ ఫ్లవర్స్ డైరెక్టర్



ఎమ్మెల్యే రామ్మోహన్‌తో మాగంటి రమేష్‌బాబు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో ఓ శుభకార్యానికి హాజరైన ఏపీలోని విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావును పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల డైరెక్టర్ మాగంటి రమేష్‌బాబు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. సీతారామచంద్ర స్వామివారి ప్రసాదం అందజేశారు.

క్రీడా మైదానం పరిశీలన

దుమ్ముగూడెం: మండలంలోని అంజుబాక క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించే నెహ్రూ, ఇందిరమ్మ మెమోరియల్ చర్ల, దుమ్ముగూడెం మండలాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పనులను ఆదివారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పోదెం యువసేన అధ్యక్షుడు, టీపీసీసీ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ తెల్లం నరేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లంక శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోడి చంటి దొర, మాజీ సర్పంచ్‌లు మడకం నాగేంద్ర, చిన్నారావు, యూత్ నాయకులు మడకం దుర్గారావు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం

ములకలపల్లి: 108 వాహంలో ఓ మహిళ ప్రసవించి, పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని చింతలపాడు గ్రామానికి చెందిన కె.రాజేశ్వరికి శనివారం అర్ధరాత్రి పురుటి నొప్పులు రావడంతో 108కు సమాచారం అందించారు. దీంతో ఏఎంటీ దుర్గాభవాని, పైలైట్ తిరుపతి చింతలపాడు వెళ్లి, రాజేశ్వరిని తీసుకుని ఆస్పత్రికి వస్తున్నారు. మార్గమధ్యలో రాజేశ్వరికి నొప్పులు ఎక్కువ కావడంతో, వాహనాన్ని నిలిపి డెలివరీ చేశారు. రాజేశ్వరి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలిద్దరూ క్షేమంగా ఉన్నారు. వైద్య చికిత్సల నిమిత్తం బూర్గంపాడు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి తెరలించారు.

ఆర్థిక సాయం

దుమ్ముగూడెం: మండలంలోని రామారావుపేట గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన పాడియం రాంబాబు వెన్నెముక సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకుని అమెరికా నుంచి డాక్టర్ వెంకట్ రూ.10 వేలు ఆర్థికసాయం పంపించారు. బాధితుడి వైద్యం నిమిత్తం రూ.4.5లక్షలు అవసరం అవుతాయని మండలంలోని బ్యూటిఫుల్ లైఫ్ అసోసియేషన్ (బీఎల్ఏ) నిర్వాహకులు వీడియో రూపంలో విరాళాలు సేకరిస్తుండటంతో సోషల్ మీడియాలో వీడియో చూసిన డాక్టర్ వెంకట్ తన వంతుగా రూ.10వేలను బీఎల్ఏ నిర్వాహకుల ద్వారా బాధితులకు పంపించారు. కార్యక్రమంలో బీఎల్ఏ గౌరవ సభ్యులు వర్సా విష్ణు, నరేష్, గ్రామస్తులు వెంకటేశ్వర్లు, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి పర్యటన

మణుగూరురూరల్: ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి ఆదివారం మణుగూరు పట్టణంలో పర్యటించారు. తొలుత బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం పలు అంశాలపై చర్చించారు. జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులందరూ ఓటు వేసి తనను ఎమ్మెల్సీగా గెలిపించాలని రాకేష్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు వట్టం రాంబాబు, తాళ్ళపల్లి యాదగిరిగౌడ్, నూకారపు రమేష్, ఎండి.యూసఫ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఏర్పాటుపై హర్షం

దమ్మపేట: రాష్ట్రంలో 317 జీఓ బాధిత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి, మంత్రి వర్గ ఉప సంఘంతో ఒక కమిటీ ఏర్పాటు చేయడంపై తెలంగాణ రాష్ట్ర గిరిజన గురుకుల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూతకాని శ్యామ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.